తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి


www.janamsakshi.org

వరంగల్ - ఆదిలాబాద్

హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్

సోమవారం
4 మే 2026

పేజీలు - 8


Follow :


## నేటి నుండి డివిజన్ స్థాయిలో 'ప్రజావాణి'

- ప్రజలకు చేరువగా సేవలు : కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ బ్యూరో, మే03 (జనంసాక్షి) : నిర్మల్ జిల్లాలో ప్రజల సమస్యలను స్థానికంగానే పరిష్కరించేందుకు డివిజన్ స్థాయిలో 'ప్రజావాణి' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. సోమవారం నుంచి నిర్మల్ ఆర్డీఓ కార్యాలయం, భైంసా సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భూ వివాదాలు, పింఛన్లు, రేషన్ కార్డులు, విద్య, వైద్యం తదితర సమస్యలపై ప్రజలు లిఖితపూర్వకంగా అర్జీలు సమర్పించవచ్చని తెలిపారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేసి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.

# ప్రకృతి వియలతాండవం

# భగ్గుమంటున్న భానుడు



### అగ్నికి ఆహుతవుతున్న పంటలు..

- దిక్కుతోచక దిగులు చెందుతున్న బాధితులు..
- చేతికందే సమయంలో అగ్గిపాలు..
- ఆందోళన చెందుతున్న రైతన్నలు..
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు..

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): ప్రస్తుత వేసవికాలంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పచ్చని పంటలు అగ్ని ప్రమాదాలకు ఆహుతవుతున్నాయి. ముఖ్యంగా ఏప్రిల్, మే నెలల్లో భానుడు బగ్గుమంటుండడంతో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడం, లేదా పొడు భూముల వద్ద కార్చిచ్చు కారణంగా ఎకరాల కొద్దీ పంటలు దగ్ధమవుతున్నాయి. ముఖ్యంగా మక్కజొన్న పంటలు అత్యధికంగా అగ్నికి ఆహుతవుతున్నాయి.


వార్త మెయిన్ 7లో




## టెన్త్‌లో మెరిసిన పల్లె స్నేహిత

- ఎమ్మెల్యే చేతుల మీదుగా సన్మానం

రెబ్బెన, మే 03(జనంసాక్షి): ఆసిఫాబాద్ నియోజకవర్గం పరిధిలోని రెబ్బెన మండలం అన్నపూర్ణ హైస్కూల్ విద్యార్థిని పల్లె స్నేహిత పదవ తరగతి పరీక్షల్లో 567 మార్కులు సాధించి మండల స్థాయిలో టాపర్‌గా నిలిచింది. ఈ విజయాన్ని గుర్తిస్తూ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆమెను మరియు ఆమె తండ్రి గోపాల్, ని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, స్నేహిత వంటి ప్రతిభావంతులైన విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు మరియు ప్రముఖులు పాల్గొన్నారు.

## ధాన్యం రైతులను వణికిస్తున్న వరుణుడు

- ఉదయం దాన్ని ఆరబోత.. సాయంత్రం పోగు చేయడం
- గాలికి పరదాలు లేచిపోతున్నాయి


వార్త మెయిన్ 7లో


# రేపటి నుండి మెగా రైతు మేళా

- సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు..
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు దిశానిర్దేశం



హనుమకొండ ప్రతినిధి మే 3 (జనంసాక్షి) : హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో నిర్వహించనున్న మెగా రైతు మేళా ఏర్పాట్లు సమన్వయంతో, ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్టంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. ఆదివారం హనుమకొండ కలెక్టరేట్ నుండి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి, సంబంధిత శాఖల అధికారులతో మెగా రైతు మేళా ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్షించారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న రైతు వారోత్సవాల సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన రైతులకు ఉపయోగపడేలా ఈ మేళాను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, పంటల నిర్వహణలో ఉత్తమ విధానాలు పరిచయం చేసే విధంగా స్టాళ్లను సమగ్రంగా సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. మూడు రోజులపాటు కొనసాగే ఈ కార్యక్రమానికి తగిన విధంగా తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, రవాణా, భద్రత తదితర అన్ని సదుపాయాలు సమృద్ధిగా కల్పించాలని పేర్కొన్నారు. వ్యవసాయ, రోడ్లు ు భవనాలు, విద్యుత్, పోలీస్, మునిసిపల్, మెప్మా తదితర శాఖల మధ్య సమన్వయం పెంచి, ప్రతి అంశాన్ని ముందుగానే ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని, ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ నిర్వహణ జరగాలని సూచించారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్నందున, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. మెగా రైతు మేళాను సమష్టిగా విజయవంతం చేసి, రైతులకు ఉపయోగకరమైన వేదికగా నిలపాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, అదనపు కలెక్టర్ రవి, ఆదనవు డిసిపి ప్రభాకర్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, డీఆర్‌డీఓ మేన శ్రీను తదితర అధికారులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం



కాసిపేట మే 03 ( జనం సాక్షి ) నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని మందమర్రి సిఐ పర్వ రమేష్ పేర్కొన్నారు. ఆదివారం కాసిపేట మండలంలోని రాంపూర్,దేవాపూర్ గ్రామాలలో, కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఎవరైనా అనుమానస్పద వ్యక్తులు ఈ ప్రాంతంలో ఉంటున్నారా లేదా, అపరిచిత వ్యక్తులకు ఎవరైనా షెల్టర్ ఇస్తున్నారా అనే కోణంలో విచారిస్తూ ప్రతి ఒక్కరి ఆధార్ కార్డ్ మరియు గుర్తింపు కార్డ్ పరిశీలించారు. ద్విచక్ర వాహనాలు ఆర్ సి, ఇన్సూరెన్స్ మరియు డ్రైవింగ్ లైసెన్స్ లు సరియగు ధ్రువపత్రాలు లేని, నెంబర్ ప్లేట్ లేని 53 ద్విచక్ర వాహనాలను గుర్తించి వాటిని అక్కడికక్కడే జరిమానా విధించారు. మరియు 3 నెంబర్ ప్లేట్ లేని ద్విచక్రవాహనాలను సీజ్ చేసారు . ఇట్టి కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ ను ఉద్దేశించి సర్కిల్ ఇన్స్పెక్టర్ పర్వ రమేష్ మరియు దేవాపూర్ ఎస్సై గంగారాం స్థానిక ప్రజలకు సైబర్ క్రైమ్, గంజాయి నియంత్రణ, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, ట్రాఫిక్ రూల్స్, కొత్త చట్టాల పై అవగాహన, మరియు మూఢ నమ్మకాల గురించి అవగాహన కల్పించారు. వాహనదారులు హెల్మెట్ తప్పకుండా ధరించాలని, ట్రాఫిక్ నిబంధన లను గురించి వివరించారు . ఈ కార్యక్రమం లో, దేవాపూర్ ఎస్సై గంగారం,కాసిపేట ఎస్సై ఆంజనేయులు, మరియు సిబ్బంది పాల్గొన్నారు .

## సహ విద్యార్థినికి పూర్వ విద్యార్థుల చేయూత



నిర్మల్ రూరల్, మే 2 ,(జనంసాక్షి) భర్తను కోల్పోయి కష్టాల్లో ఉన్న సహ విద్యార్థినికి 1990-91 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. వెల్మల్ బొప్పారం ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న 1990-91 బ్యాచ్ విద్యార్థులు తమ స్నేహితురాలు మల్యాల లక్ష్మికి రూ.56,600 ఆర్థిక సహాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు.లక్ష్మి భర్త మల్యాల మహేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న పూర్వ విద్యార్థులు వెంటనే స్పందించిన సహ విద్యార్థులు విరాళాలు సేకరించి శుక్రవారం నిర్మల్ పట్టణం బశీగల్ పేట్ లోని వారి నివాసానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సేకరించిన 56,600 రూపాయలతో పాటు 25కేజీ బియ్యం బ్యాగ్ ను లక్ష్మికి అందజేసి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ "35 ఏళ్ల నాటి స్నేహ బంధం మాది. కష్టకాలంలో స్నేహితురాలికి అండగా నిలవడం మా బాధ్యత. భవిష్యత్తులోనూ కుటుంబానికి తోడుగా ఉంటామన్నారు.

## బాల్యమిత్రుడి కుటుంబానికి రూ. 13 వేల ఆర్థిక సహాయం



చెన్నారావుపేట, మే 3 ( జనం సాక్షి): మండలంలోని పాపయ్యపేట గ్రామానికి చెందిన గద్దం రాజు అనారోగ్యంతో బాధపడుతూ మరణించాడు.అతని చిన్ననాటి స్నేహితులు అతని కుటుంబానికి భరోసానిచ్చి మనోధైర్యాన్ని కల్పించారు.తమ వంతు ఆర్థిక సహాయంగా ఆదివారంరూ.13వేలను అతని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మిత్రులు సూర రాజు, చెన్నూరు రవి, లింగాల సంతోష్, మూన్య శ్రీను, గుండెబోయిన రాజు, బోడ రాజ్ కుమార్, బిళ్ళ రజనీకర్, చల్లా రవీందర్, మిచ్చు స్వామి, చెన్నూరు స్వామి, బోడ వెంకన్న, ఆలేటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# దైత అమ్మవారికి తిరుమంజనం

### నేడు స్వామివారికి తెప్పోత్సవం - దోపోత్సవం



మంగపేట, మే03 (జనంసాక్షి)మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు ఆదివారం మల్లూరు క్షేత్రంపై కొలువుతీరిన దైత అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఈ అభిషేక కార్యక్రమాన్ని భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఉప ప్రధానార్చకులు అమరవాది మురళీకృష్ణమాచార్యుల బృందం, రుత్వికులు భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి అర్చకులు అమరవాది మురళీకృష్ణమాచార్యుల బృందం, యాజ్ఞికులు అమరవాది రామ నరసింహాచార్యులు, శ్రీపెరంబుదూరు మదన మోహనాచార్యులు, మణిదీపాచార్యులు, భరద్వాజాచార్యులు, సాయి వెంకటాచార్యులు, కారంపూడి శ్రీనివాసవిరించిచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటల సమయంలో దైత అమ్మవారికి తిరుమంజనం కార్యక్రమంలో భాగంగా కుంకుమ, చందనం, జలాభిషేకాలతో అభిషేకాన్ని నిర్వహించి అనంతరం దైత అమ్మవారికి పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎం. వీరస్వామి, శ్రవణం సత్యనారాయణ, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ యర్రంగారి సురేష్ లు అమ్మవారికి మంగళహారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ముక్కామల రాజశేఖర్ శర్మ, కారంపూడి పవనా కుమారాచార్యులు, ఏడునూతల ఈశ్వరచంద్ రామానుజన్ శర్మ, ముక్కామల వెంకటనారాయణ శర్మ, అనిపెద్ది రాజీవ్ నాగశర్మ , ఆలయ సిబ్బంది శేషు, అజయ్, నవీన్, నాగార్జున్ మహేష్, నరేష్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## బావిలో ఈతకు వెళ్లి గల్లంతై వ్యక్తి మృతి



బచ్చన్నపేట మే 3 ( జనం సాక్షి):జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రంలో బావిలో ఈతకు వెళ్లిన యువకుడు శని వారం గల్లంతై ఆదివారం ఉదయం శవమైన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మండల కేంద్రానికి చెందిన ఏనుగుల బిక్షపతి పద్మ దంపతుల చిన్న కుమారుడైన ప్రశాంత్ ట్రాక్టర్ డ్రైవర్ (27) సిద్దిపేట వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న రాజన్న బావిలో శనివారం ఈతకు వెళ్లాడు, ఈతకొడుతున్న క్రమంలో పైనుంచి దూకాడు, దూకిన కొద్దిసేపటి వరకు ప్రశాంత్ కనిపించకపోవడంతో స్థానికులు పోలీసులకు తెలిపారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకుని ఫైర్ సిబ్బంది గజ ఈతగాళ్లను తీసుకొచ్చి బావిలో నాలుగు గంటలపాటు గాలించినా ప్రశాంత్ ఆచూకీ దొరకలేదు, అయితే ఆదివారం తెల్లవారుజామున స్థానికులు మరోసారి బావిలో వెతకడంతో ప్రశాంత్ మృతదేహం లభ్యమైంది, ప్రశాంత్ మరణంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు స్థానిక ఎస్ఐ ఏ శ్రీకాంత్ తెలిపారు

## తాగుడేటి ఎద్దడిని నివారించేందుకు చర్యలు

### కంది గడ్డ తండా గ్రామ సర్పంచ్ సహదేవుడ జ్యోతి వెంకన్న



చెన్నారావుపేట, మే 3 ( జనం సాక్షి ): తాగునీటి ఎద్దడిని నివారించేందుకు తగిన చర్యలు చేపట్టినట్లు కంది గడ్డ తండా గ్రామ సర్పంచ్ సహదేవుడ జ్యోతి వెంకన్న తెలిపారు. ఆదివారం కంది గడ్డ తండా గ్రామంలోని నడిగడ్డ తండాలో 5 హెచ్ పి, వాటర్ ప్లాంట్ కు 1 హెచ్ పి నూతన విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేసి ప్రారంభించారు. వేసవిలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు నూతన విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీటిని అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గుగులోతు కృష్ణ, వార్డు సభ్యులు, తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు వరం సీఎం సహాయనిధి

### కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్



బచ్చన్నపేట మే 3 ( జనం సాక్షి): నిరుపేదలకు ఆరోగ్యపరంగా అయ్యే ఖర్చులకు సీఎం సహాయనిధి వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మంగోలు రత్నమ్మ. గూడెముల నవ్యకు వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ, వైద్యానికి పెద్దమొత్తంలో డబ్బులు ఖర్చు కాగా, స్థానిక కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఇరుగు ప్రకాష్ ద్వారా నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ దృష్టికి రాగా, వెంటనే సీఎం సహాయ నిధి నుండి ఇద్దరికి లక్ష రూపాయల చెక్కులను మంజూరు చేయించి, మండల కేంద్రంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు నూకల బాల్ రెడ్డి,జనగామ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దూడల సిద్దయ్య, మైనారిటీ బచ్చన్నపేట మండల అధ్యక్షుడు ఇస్మాయిల్, మండల మహిళ అధ్యక్షురాలు భాగ్య లక్ష్మి,నాగి రెడ్డిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ శాఖ అధ్యక్షులు ఇరుగు ప్రకాష్, జిల్లా సీనియర్ నాయకులు జిల్లా సందీప్, ఎండీ ఘోష్, తమ్మడ పల్లి ఉప సర్పంచ్ గోలకొండ నాగరాజు, ఓ బి సి వెంకట్, హరికృష్ణ, రమేష్, సుందర రాములు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ సింగల్ విండో చైర్మన్ వామన్ రావు



మహదేవపూర్ :మే 3 (జనంసాక్షి ): మహదేవపూర్ మండలం ఎడపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కుమ్మరి రాజమల్లు తమ్ముడు రజిని కుమార్- మల్లేశ్వరి వివాహ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ దేవస్థానం చైర్మన్, మాజీ సింగల్ విండో చైర్మన్ ఈ వామన్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయగిరి దేవేందర్. జనంసాక్షి పత్రిక సీనియర్ జర్నలిస్ట్ అయిత రాజిరెడ్డి. భూపాల్ రెడ్డి. కుమ్మరి గట్టయ్య. వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# ఘనంగా కాకులమర్రి లక్ష్మణ్ బాబు జన్మదిన వేడుకలు

## వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం, పండ్లు పంపిణీ



**మంగపేట, మే 03(జనంసాక్షి)**మండల కేంద్రంలో తెలంగాణ సెంటర్ వద్ద ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు జన్మదిన వేడుకలను మండల బిఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం మాజీ బిఆర్ఎస్ పార్టీ మంగపేట గ్రామ అధ్యక్షులు నూనె లింగయ్య ఆధ్వర్యంలో కాకులమర్రి లక్ష్మణ్ బాబు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ జిల్లా నాయకుడు తాటి కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి నేటి వరకు కూడా నిరుపేద, బడుగు బలహీన వర్గాలకు తన సొంత నిధులతో అనేక కార్యక్రమాలు నిర్వహించిన ఒక గొప్ప మహానీయుడని అంతే కాకుండా జిల్లాలో ఎవరికి ఏ ఆపద వచ్చినా ఆ కుటుంబానికి నేనున్నానంటూ ముందుకు వచ్చి వారి సమస్యను పరిష్కరించి వారి వెన్నంటే ఉండే ఒక మంచి మనసున్న జననేత అని వారి సేవలను కొనియాడారు. అనంతరం కస్తూరిబాయి వృద్ధాశ్రమంలో పండ్ల పంపిణీ చేసి అన్నదానం కోసం 50 కేజీల బియ్యాని అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కొమరం ధనలక్ష్మి, కాటూరి సుగుణ, చిట్టిమల్ల సమ్మయ్య, కాడబోయిన నరేందర్, కోరం సంతోష్, చిలకమర్రి రాజేందర్, పప్పు వెంకట్ రెడ్డి, సిద్ధంశెట్టి లక్ష్మణరావు, ఎండి కుర్బాన్ అలీ, గాదె శ్రీనివాస చారి, దంతనపల్లి నరేందర్, తుక్కాని శ్రీనివాస్, నూతలకంటి ముకుందం, పూజారి శ్రీను, పిల్లలమర్రి వేణు, నిమ్మగడ్డ ప్రవీణ్, పొదెం రాంబాబు, గౌని రమేష్ గౌడ్ , కర్రీ రామ్మోహన్, గాజుల శ్రీనివాస్ గౌడ్ , కళావతి తదితరులు పాల్గొన్నారు.

## మల్హర్ కు కోటి అరవై లక్షల సి ఆర్ ఆర్ నిధులు

## మంత్రి శ్రీధర్ బాబు కు కృతజ్ఞతలు



**మల్హర్,మే 03(జనంసాక్షి)**భూపాలపల్లి జిల్లాలోని మాలహార్ రావు మండలానికి సిఆర్ ఆర్ ఎస్సి కాంపొనెంట్ క్రింద కోటి అరవై లక్షల రూపాయల నిధులు మంజూరు చేసిన,రాష్ట్ర ఐటి పరిశ్రమలు శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కు మండల్లాలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు, గ్రామపంచాయతీ సర్పంచ్ లు మరియు పాలకవర్గం సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.మండలం లోని పలు గ్రామాలకు మంజూరైన నిధులు అడ్వాలపల్లి 5లక్షలు, అన్సాన్ పల్లి 10లక్షలు, చిన్న తూండ్ల 5లక్షలు, దుబ్బపేట 10లక్షలు, ఎడ్లపల్లి 30 లక్షలు, ఇప్పలపల్లి 10 లక్షలు, కొండంపేట పది లక్షలు,కొయ్యూరు పది లక్షలు,మల్లంపల్లి 5లక్షలు,మల్లారం 5లక్షలు, నాగారం 5లక్షలు , పెద్దతూండ్ల 15లక్షలు,పెద్ద తూండ్ల గాదంపల్లి ఐదు లక్షలు, రుద్రారం 20 లక్షలు,తాడిచర్ల 10 లక్షలు,వల్లెంకుంట 10 లక్షలు రూపాయలు మంజూరైనవి అని మండల కాంగ్రెస్ అధ్యక్షులు బడితేల రాజయ్య ఒక ప్రకటనలో తెలుపుతు రాష్ట్ర ఐటి పరిశ్రమలు శాఖ మంత్రి కి మండల ప్రజల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సర్పంచ్ మహేశ్వరి రాజు ముందడుగు

## బీరన్న దేవాలయం వద్ద బోరు ఏర్పాటు



**ఆత్మకూరు, మే 3 (జనం సాక్షి):** గ్రామాభివృద్ధి పట్ల తన కట్టుబాటును మరోసారి చాటుతూ సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి రాజు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆత్మకూరు బీరన్న దేవాలయం సమీపంలో గ్రామ ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని బోరు ఏర్పాటు కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. గ్రామంలో నీటి కొరత సమస్యను గుర్తించిన మహేశ్వరి రాజు, వెంటనే స్పందించి పాలకవర్గంతో కలిసి ఈ పనిని చేపట్టడం విశేషం. ఆమె నాయకత్వ ంలో నిర్వహించిన ఈ కార్యక్రమం గ్రామస్థుల్లో విశేష సంతోషాన్ని కలిగించింది. ఈ సందర్భంగా మహేశ్వరి రాజు మాట్లాడుతూ, "ప్రజలకు అవసరమైన ప్రాథమిక సదుపాయాలు కల్పించడం మా బాధ్యత. నీటి సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు ఇలాంటి చర్యలు కొనసాగిస్తాం" అని తెలిపారు. గ్రామ ప్రజలు సర్పంచ్ చొరవను అభినందిస్తూ, అభివృద్ధి పనులు మరింత వేగంగా కొనసాగాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# నేడు రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో అవగాహన కార్యక్రమం



**గంగారం మే 03 (జనం సాక్షి)** తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ,99 రోజుల ప్రణాళిక లో భాగంగా నేడు నిర్వహించనున్న రైతు వారోత్సవం కార్యక్రమం ను రైతు వేదిక కార్యాలయంలో నిర్వహించబడును. రైతు వేదిక కార్యాల యం నందు క్రింది అంశాలపై అవగాహన కల్పించబడును నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల ఎరువుల వినియోగం, సహజ వ్యవసాయం, నాణ్యమైన విత్తనాల వినియోగం, పంట రుణాలు, వ్యవసాయ యాంత్రీకరణవంటి అంశాలపై రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించబడును.కావున రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని వ్యవసాయ శాఖ వారు అందించే సలహాలు సూచనలు అందిపుచ్చుకుని ,మెరుగైన దిగుబడులు సాధిస్తారని మండల వ్యవసాయ అధికారి వేణు యాదవ్ తెలిపారు.

# గంజాయి కేసులో ఇద్దరు అరెస్టు

**బెల్లంపల్లి, మే 3, (జనంసాక్షి)**బెల్లంపల్లి మండలం బట్వాన్ పల్లి గ్రామంలో గంజాయి కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు తాళ్ల గురిజాల ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నమ్మదగిన సమాచారం మేరకు బట్వాన్ పల్లి గ్రామంలో దాగం రోహిత్ అనే వ్యక్తి తన ఇంట్లో అక్రమంగా గంజాయి కలిగి ఉన్నాడని తెలియడంతో రోహిత్ ఇంటిలో సోదా చేసి 190 గ్రాముల గంజాయి, రెండు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అతని ఇంటిలో ఎండు గంజాయి దొరకడంతో ప్రశ్నించగా గంజాయిని మహారాష్ట్ర నుంచి తీసుకువచ్చి తన స్నేహితుడు జుమ్మిడి రాజశేఖర్ తో కలిసి చిన్న చిన్న ప్యాకెట్స్ చేసి చుట్టుపక్కల విక్రయిస్తున్నట్లు తెలిపినట్లు వివరించారు. అనంతరం రాజశేఖర్ ఇంటిని కూడా సోదా చేయగా ఇంట్లో ఎండు గంజాయి, రాజశేఖర్ ఇంటి చుట్టుప్రక్కల ఇంటి వెనుక పెరడులో రెండు గంజాయి మొక్కలు కనిపించాయన్నారు. మహారాష్ట్ర నుంచి ఎండు గంజాయి తీసుకురావడం కన్నా ఇక్కడే గంజాయి మొక్కలు నాటితే లాభదాయకమని నిందితులు మొక్కలు నాటారని వివరించారు. ఇంకా ఎక్కువ మొత్తంలో డబ్బులు సంపాదించవచ్చని గంజాయి విత్తనాలు నాటి మొక్కలు పెంచుతున్నారన్నారు. ఇద్దరి నుంచి 690 గ్రాములు ఎండు గంజాయి, రెండు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిషేదిత మారకద్రవ్యాల ప్రకా రం కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్ చేసినట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు.



# తిరుపతి గౌడ్ ను పరామర్శించిన గౌడ సంఘం నేతలు



**చిట్యాల, మే 03( జనం సాక్షి):** గౌడ సంఘం జిల్లా నాయకులు మూల తిరుపతి గౌడ్ ను ఆదివారం తెలంగాణ గౌడ సంఘం జిల్లా నాయకులు పరా మర్శించారు. మండల కేంద్రంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన మూల తిరుపతి గౌడ్ మాతృమూర్తి రాజమ్మ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందింది. కాగా విషయం తెలుసుకున్న తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీపతి ప్రభాకర్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు తడుక సుధాకర్ గౌడ్, సంఘం జిల్లా నాయకులు జక్కె రమేష్, తదితర నాయకులు తిరుపతి గౌడ్ ను పరామర్శించి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతురాలు రాజమ్మ చిత్రపటానికి పూలు వేసి ప్రగాఢ సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని మనోధైర్యం కల్పించారు.

## యాంకర్; వరల్డ్ ప్రెస్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు



**నర్సంపేట మే 3 ( జనం సాక్షి)** వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలోని దీక్షకుంట గ్రామంలో హనుమాన్ మాల దీక్ష స్వాముల ఆధ్వర్యంలో జర్నలిస్టు దినోత్సవం ఘనంగా నిర్వహించారు... ఆదివారం జర్నలిస్ట్ గురుస్వామిలు అందేశ్వర స్వామి, కోల ప్రవీణ్ స్వామి. సీనియర్ జర్నలిస్ట్ 10టీవీ నర్సంపేట రిపోర్టర్ పోనగంటి స్వామి రావు. ను ఘనంగా పూలమాలవేసి శాలువతో సన్మానించారు.. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గురు స్వామి ఆలకుంట సురేందర్ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా జర్నలిజమైన దేహంగా సమాజంలో ఏదో ఒక సేవ చేయాలంటూ మండల స్థాయి రిపోర్టర్ నుంచి జిల్లా స్థాయి రిపోర్టర్ వరకు అంచలంచెలుగా ఎదిగిన సీనియర్ జర్నలిస్టు పొనగంటి స్వామి అని సమాజ సేవలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వార్త సేకరణ చేస్తూ ప్రజలకు వారధిగా ఉంటున్నాడు అతనికి జర్నలిస్టు రోజు శుభాకాంక్షలు తెలుపుతూ అతనినీ సన్మానించడం జరుగుతుంది.. ఈ కార్యక్రమంలో దొరికిన రమేష్ చీపురు మల్లయ్య ప్రశాంత్ సూర్యప్రకాష్, మూడు ప్రేమాకర్ సిద్దు అనిల్, దుర్గయ్య, సురేష్ శివ తదితరులు పాల్గొన్నారు...

# కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడాలి

## ఐఎన్‌టియుసి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

## కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి



**శాయంపేట, మే 3 (జనం సాక్షి)**కార్మికుల హక్కులు సంక్షేమం కోసం ఐ ఎన్ టి యు సి నిరంతరం పోరాటం చేయాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం ఐ ఎన్ టి యు సి మండల అధ్యక్షుడు మారేపల్లి రాజేందర్ ఆధ్వర్యంలో ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శాయంపేట సెంటర్ లో కేక్ కట్ చేసి, కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి మాట్లాడుతూ దేశంలోనే కార్మిక సంఘాలలో ఐఎన్టియుసి ప్రముఖమైనదని, కార్మికుల సంక్షేమశీ మరియు సమాన వేతనాల కోసం పోరాడుతొందన్నారు. దేశవ్యాప్తంగా కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చింతల రవిపాల్, కొత్తపెల్లి రవీందర్, మారేపల్లి కట్టయ్య, తిరుపతి రెడ్డి, దైనంపెల్లి రాజయ్య, సాధిక్, మారపెల్లి చిరంజీవి, లోకలబోయిన కుమారస్వామి, గట్టు ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

### ఎమ్మెల్యే సత్యనారాయణ రావు



**టేకుమట మే 03 జనంసాక్షి** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పార దర్శకత పాటించాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అన్నారు ఈరోజు ఆదివారం టేకుమట్ల మండలంలో రాఘవరెడ్డిపేట,వెల్లంపల్లి టేకుమట్ల గ్రామాల్లో పి.ఎ.సి.ఎస్ ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు సరైన మద్దతు ధర కొనుగోలు కేంద్రాల ద్వారానే లభిస్తుందన్నారు.రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని, తేమ శాతం వచ్చిన తర్వాత మార్కెట్‌కు తరలించి మద్దతు ధర పొందాలన్నారు.తూకం విషయంలో ఎలాంటి లోపాలు జరగకుండా ప్రతీ ఒక్కరు బాధ్యతగా వ్యవహరించి, రైతులకు న్యాయం చేయాలని కోరారు 230 లక్షల రూపాయల నిధులతో పలు గ్రామాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు మండలంలోని బోర్నపల్లి గ్రామంలో 50 లక్షల రూపాయలతో గట్టుమల్లన్న దేవాలయం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు రామకృష్ణాపూర్ (వి) గ్రామంలో 20 లక్షల రూపాయలతో ఎస్సీ కాలనీ నుండి గర్మిళ్లపల్లి బీటీ రోడ్డు వరకు రైతుల వ్యవసాయ భూములకు వెళ్లే రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు 60 లక్షల రూపాయలతో వెలిశాల (కిష్టయ్య పల్లి) నుండి రామకృష్టాపూర్ (వి) వరకు సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు 80 లక్షల రూపాయలతో వెలిశాల గ్రామము నుండి రాఘవపూర్ గుట్ట వరకు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు పెద్దంపల్లి గ్రామంలో 20 లక్షల రూపాయలతో రైతుల వ్యవసాయ భూములకు వెళ్లే రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు ఇట్టి కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట సంబంధితశాఖ అధికారులు,మండలంలోని స్థానిక ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రశాంతంగా కొనసాగిన నీట్ పరీక్ష

### కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 03 (జనంసాక్షి ):**జిల్లాలో నీట్ పరీక్ష ప్రశాంత వాతా వరణంలో సజావుగా సాగిందని జిల్లా కలెక్టర్ కె.హ రిత తెలిపారు. ఆదివా రం జిల్లా కేంద్రంలోని జన కపూర్ లో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల, బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరిగిన నీట్ పరీక్షకు 316 మంది అభ్యర్థులు హాజరు కావలసి ఉండగా 313. మంది హాజరయ్యారని తెలిపారు. అభ్యర్థులను అడ్మిట్ కార్డుతో పాటు నిబంధనల ప్రకారం ప్రభుత్వ గుర్తింపు గల ఒరిజినల్ ఐడి కార్డ్ తో అనుమతించడం జరిగిందని తెలిపారు. ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరిగిందని, పరీక్షా కేంద్రంలోకి చేతి రుమాలు, మొబైల్ ఫోన్, చేతి గడియారం, బెల్టు, ఉంగరం, గొలుసు, చెవిపోగులు మొదలైన ఆభరణాలు, ఎలక్ట్రానిక్, కమ్యూనికేషన్ పరికరాలు , పెన్ను, పెన్సిల్, ఎరేజర్, షార్పనర్, కరెక్షన్ ఫ్లూయిడ్ వంటివి అనుమతించలేదని తెలిపారు. పరీక్ష ప్రారంభం నుండి చివరి వరకు మొత్తం విడియో రికార్డ్ చేయడం జరిగిందని, పరిక్షా కేంద్రంలో 22 సి సి కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, 28 మంది ఇన్విజిలేటర్లు, ఒక పరిశీలకుడు, ఇద్దరు చీఫ్ సూపరింటెండ్స్ విధులు నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నికైన గాజుల రవిని సన్మానించిన దరువు భోజన్న



**సారంగాపూర్ , మే 03,(జనం సాక్షి)**నిర్మల్ మున్సిపాలిటీ లో నూతనంగా ఎన్నుకోబడిన కో ఆప్షన్ సభ్యులు గాజుల రవికుమార్ ను తెలంగాణ దూం దాం కళాకారుడు దరువు టేకులపల్లి భోజన్న మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## పదవ తరగతి ఫలితాల్లో జిల్లా మొదటి స్థానంలో గౌడబిడ్డ కోరంకున్నత్ (రొయ్యల)కృష్ణ

### 600/589 మార్కులు సాధించిన కృష్ణ



**ఏటూరు నాగారం మే 03 (జనం సాక్షి).**ఏటూరునాగారం : మండల కేంద్రంలోని (రొయ్యల) కోరం కున్నత్ రంజిత్ కుమార్ గౌడ్ సంధ్య, దంపతుల కుమార్తె కృష్ణగౌడ్, పదవ తరగతి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని 600 మార్పుల కు గాను 589 మార్కులు సాధించి, జిల్లా స్థాయిలో మొదటి స్థానం లో టాపర్ గా నిలవడం జరిగింది. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం రోజున రేణుక ఎల్లమ్మ గుడి ఆలయ చైర్మన్ గడ్డం రాజమొగిలి గౌడ్, అధ్యక్ష తన రొయ్యల కృష్ణ కు, ఆత్మీయ సన్మానం చేయడం జరిగింది.

ఈ సందర్భంగా గడ్డం రాజమొగిలి గౌడ్, కల్లు గీత సొసైటీ అధ్యక్షులు సప్పిడి రాము గౌడ్, ఉపాధ్యక్షులు మేరుగు రఘు గౌడ్, సంఘం మండల నాయకులు తాళ్లపేల్లి నరేందర్ గౌడ్ లు, మాట్లాడుతూ పట్టుదలతో చదివి జిల్లా టాపర్ గా నిలిచి ఏటూరునాగారం పేరు నిలబెట్టడం చాలా అభినందనీయమని అన్నారు.చదువుకు పేదరిక అడ్డు కాదని కృష్ణ , నిరూపించిందని అన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో ఉన్నత స్థాయి చదువులు చదువు కొని సమాజంలో మంచి గుర్తింపు పొందాలని వారన్నారు. ఈ సందర్భంగా కృష్ణ ,తో పాటు వారి తల్లిదండ్రులు రంజిత్ కుమార్, సంధ్య లను, కూడా సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి కృష్ణ, మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం చేయడం చాలా సంతోషం అని అన్నారు. ఎల్లపుడు కృష్ణ పై చదువు లకు కళ్ళుగీత కార్మిక సంఘం అండగా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సప్పిడి రామ్ నరసయ్యగౌడ్, మొడెం వెంకటస్వామి గౌడ్, బోనగాని సదానందం గౌడ్, తాళ్లపేల్లి మోహన్ గౌడ్, గడ్డం మహేష్ గౌడ్, గడ్డం వినయ్ గౌడ్, మెరుగు వెంకటేశం గౌడ్, గడ్డం ప్రసాద్ గౌడ్, గడ్డం బిక్షపతి గౌడ్, తాళ్లపెల్లి వెంకటస్వామి గౌడ్, తోపాటు 30 మంది కల్లు గీత కార్మికులు పాల్గొన్నారు.

## డివిజన్ స్థాయిలలో ప్రజావాణి నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి, మే 3 (జనం సాక్షి):**ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన "ప్రజావాణి" కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం ఒక ప్రకటన లో తెలిపారు. ప్రజల సమస్యల సత్వర పరిష్కారమే డివిజన్ స్థాయి ప్రజావాణి ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడమైనదని జిల్లా కలెక్టర్‌పే ర్కొన్నారు .ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.ప్రతి సోమవారం జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రజావాణి నిర్వహించడం జరుగు తుందన్నది అందరికీ తెలిసిన విషయమైనప్పటికి రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఆర్‌డీవో కార్యాలయాలలో కూడా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుందని కలెక్టర్ అన్నారు. అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు జిల్లా స్థాయిలో. డివిజన్ స్థాయి అధికారులు డివిజన్ స్థాయిలో జరిగే ప్రజావాణికి తప్పనిసరిగా హాజరై, ప్రజల వినతులను స్వీకరించి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజల ఫిర్యాదులను ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేసి, ప్రతి వినతికి ప్రత్యేక ధృవీకరణ నంబర్ కేటాయించ బడుతు ందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అందిన ఫిర్యాదులను 30 రోజులలోపు పరిష్కరించి, తీసుకున్న చర్యల నివేదికలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.ప్రజలు తమ ఫిర్యాదుల స్థితిని ఆన్‌లైన్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుందని వారు పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్ కార్యాలయాలలో డివిజన్ స్థాయిలో ప్రత్యేక ప్రజావాణి విభాగాలు ఏర్పాటు చేయాలని, అధికారులు ప్రజల పట్ల నిబద్ధత తో వ్యవహరించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి తెలిపారు.

## క్లాస్మేట్ మిత్రుడి కుమార్తె వివాహానికి ఆర్థిక సహాయం



**గూడూరు,మే03(జనంసాక్షి):** గూడూరు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 2001 బ్యాచ్ 10వ,తరగతి పూర్వ విద్యార్థి జగన్నాయకులగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని గండితండాకు చెందిన బానోత్ సురేష్ కుమార్తె వివాహ మహోత్సవానికి క్లాస్మేట్ మిత్రబృందం ఆదివారం వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించినారు.అనంతరం 40 వేల రూపాయలతో పాటు పట్టుచీర అందజేశారు. ఈసందర్భంగా బానోత్ సురేష్ పూర్వ విద్యార్థులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్థిక సహాయం అందించిన వారు పూర్వ విద్యార్థులు గుండెబోయిన మల్లేష్ యాదవ్,గుగులోత్ దాసు,ఎండి సులేమాన్, మండలం మల్లేష్,పాపాని శ్రీనివాస్,అజ్మీర శంకర్,ఎండి రహీం,మండల సుధాకర్, వంగపండ్ల మల్లేష్,నునావత్ కృష్ణ,బాల్సుకూరి,శ్రీనివాస్ ఎండి సలీం,పూర్ణచందర్, బట్టు సురేందర్,కక్కర్ల అనుదీప్,వీరన్న,పబ్బతి మహేష్,భీమగాని వేణు, సత్యపాల్,బి.శంకర్, గుగులోత్ వెంకన్న,ఎస్కే అమీరుద్దీన్,పూజారి నరేష్, వెంకన్న,పాల్గొన్నారు ఆర్థిక సహాయం అందజేశారు.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నూకల బాల్ రెడ్డి

### అభినందనలు తెలిపిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్

**బచ్చన్నపేట మే 3 ( జనం సాక్షి):**జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన నూకల బాల్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ అభినందనలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగపురి మాట్లాడుతూ సీనియర్ కాంగ్రెస్ నాయకునికి దక్కిన గౌరవం అని, మండల పార్టీ అధ్యకుడి నుంచి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్ష పదవి రావడం తో బాల్ రెడ్డి కి బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఈ పదవికి మరింత వన్నె తెస్తారని ఆశిస్తున్నాను అని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనగామ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దూడల సిద్దయ్య, మైనారిటీ బచ్చన్నపేట మండల అధ్యక్షుడు ఇస్మాయిల్, మండల మహిళ అధ్యక్షురాలు భాగ్య లక్ష్మి, జిల్లా సీనియర్ నాయకులు జిల్లా సందీప్, ఎండీ ఘోష్, నాగి రెడ్డిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ శాఖ అధ్యక్షులు ఇరుగు ప్రకాష్, తమ్మడ పల్లి ఉప సర్పంచ్ గోలకొండ నాగరాజు, ఓ బి సి వెంకట్, గుజ్జల మధు, కడారు నాని, బండారం క్రాంతి, రమేష్, అవ్వదులు శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ హరికృష్ణ, రమేష్, సుందర రాములు తదితరులు పాల్గొన్నారు



# కార్మిక హక్కులను అణచివేస్తున్న ప్రభుత్వాలు

**సిఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దుండి వీరన్న**



మరిపెడ మే 3(జనం సాక్షి)కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాల రాస్తున్నాయని , వాటికి పోరాడి సాధించుకోవాలని సి ఐ టీ యు జిల్లా ఉపాధ్యక్షులు దుండి వీరన్న అన్నారు. ఆదివారం మరిపెడ మండలంలోని ఉల్లెపల్లి లో భవన నిర్మాణం కార్మిక సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినంక కార్మిక హక్కులను కాలరాస్తూ కార్మిక చట్టాలను రద్దు చేసిందని విమర్శించారు. 29 కార్మిక చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్ కిస్తురావడం వలన కోట్లాదిమంది కార్మికులకు నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి విధానాలను కార్మికులు ఐక్యంగా ఉండి పోరాడి సాధించుకోవా లన్నారు. అంతేగాక భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల నిధిని ఇతర సంస్థలకు దారి మళ్లించి కార్మికుల శ్రమలు ప్రభుత్వాలు దోచుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. సిఐటియు పోరాటాల వల్ల అనేక రకాలుగా కార్మిక సౌకర్యాల కోసం రావాల్సిన హక్కులను సాధించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కొండ ఉప్పలయ్య, ఉపాధ్యక్షులు జినక సైదులు, సీనియర్ నాయకులు నవిల నెంబర్ వెంకన్న, తదితరులు ఉన్నారు.-నూతన కమిటీ ఎన్నిక మండలంలోని ఉల్లపల్లి గ్రామంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షులుగా సంద్ర బిక్షం కార్యదర్శిగా ఎర్ల నారాయణ కోశాధికారిగా ఉల్లోజు వేమన ఉపాధ్యక్షులుగా నవిలే రాంబాబు తదితరులు ఉన్నారు.

# చారిత్రక బౌద్ధంపై అధ్యయన తరగతి

**పూలే, పెరియార్, అంబేద్కర్ ఆలోచన వేదిక.**



బెల్లంపల్లి, మే 3, (జనంసాక్షి)బెల్లంపల్లి మండలంలోని సుబ్బారావుపల్లి గ్రామంలో ఆదివారం జైభీమ్ భవన్లో అధ్యయన సదస్సును పూలే, పెరియార్, అంబేద్కర్ ఆలోచన వేదిక ప్రధాన సలహాదారుడు వేల్పుల కనకయ్య అధ్యక్షతన నిర్వహించారు. భారత బౌద్ధ సమాజం అధ్యక్షుడు కోల శ్యామ్ పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిత్రక బౌద్ధము క్రీస్తుపూర్వం 5వ శతాబ్దంలో ప్రాచీన భారతదేశంలోని మగధ రాజ్యంలో సిద్ధార్థ గౌతముని బోధనల నుండి ఉద్భవించిందని అన్నారు. సమానత్వం, నైతికత, దుఃఖ విముక్తిని బోధిస్తూ, అశోకుడి కాలంలో విస్తరించి, నేడు ప్రపంచవ్యాప్తంగా 500 మిలియన్లకు పైగా ప్రజలు ఆచరిస్తున్న ప్రధాన మతాలలో ఒకటిగా నిలిచిందన్నారు. సిద్ధార్థ గౌతముడు క్రీపూ 6వ శతాబ్దంలో నేపాల్లోని లుంబినిలో జన్మించి జ్ఞానోదయం పొంది బుద్ధుడు అయ్యాడని, బౌద్ధంలో బాధలను అర్థం చేసుకోవడం, జ్ఞానాన్ని పెంపొందించడం, నైతిక జీవితాన్ని గడపడంపై దృష్టి సారించారని అన్నారు. 3వ శతాబ్దంలో మౌర్య చక్రవర్తి అశోకుని ఆధ్వర్యంలో బౌద్ధమతం భారతదేశానికి, అంతర్జాతీయంగా వేగంగా వ్యాపించిందని, ఇది భారత ఉపఖండంలో సామాజిక సమానత్వ భావనలను బలోపేతం చేసి గొప్ప పర్యాటక, సాంస్కృతిక వారసత్వాన్ని వదిలివేసి కీలకమైన చారిత్రక ఘటనలుగా మారాయని అన్నారు. మొదటి బౌద్ధ సంగీతి బుద్ధుని నిర్యాణం తర్వాత, రాజగృహలో అజాతశత్రువు ఆధ్వర్యంలో మొదటి సమావేశం జరిగిందన్నారు.

**- మహాయాన, హీనయాన...**

బౌద్ధ సమాజం మహాసాంఘిక, స్థవిరవాద అనే రెండు ప్రధాన విభాగాలుగా విడిపోయింది. ఇవి తర్వాత మహాయాన, థేరవాదగా రూపాంతరం చెందాయి. చారిత్రక బౌద్ధమతం అహింస, కరుణ, మధ్యేమార్గం వంటి సూత్రాల ద్వారా ప్రపంచ నాగరికతపై చెరగని ముద్ర వేసిందని అన్నారు. అంబేద్కర్, గౌతమ బుద్ధుని సిద్ధాంతాలైన సమత, మమత, సమానత్వం ద్వారానే బలహీన వర్గాలకు విముక్తి సాధ్యమని నమ్మి, 1956 అక్టోబర్ 14న నాగ్‌పూర్‌లో లక్షలాది అనుచరులతో కలిసి బౌద్ధమతాన్ని స్వీకరించారని అన్నారు. ఆయన రచించిన బుద్ధుడు, అతని ధమ్మ గ్రంథం నవయాన బౌద్ధానికి మూలస్తంభం, ఇది కుల నిర్మూలన, సామాజిక న్యాయంపై బుద్ధుని బోధనలను ఆధునిక దృక్పథంతో వివరించారని అన్నారు. అంబేద్కర్ కుల వ్యవస్థను, పురుషాధిక్యతతో ద్వేషాన్ని వ్యాపింపజేస్తూ, స్త్రీల ప్రయోజనాలను అణచివేస్తున్న మత గ్రంథాలను విమర్శించారు. కులాంతర భోజనాలు, కులాంతర వివాహాలు కుల వ్యవస్థను నిర్మూలించడానికి సరిపోవని, కుల వ్యవస్థను విచ్ఛిన్నం చేసే అసలైన పద్ధతి కులానికి ఆధారమైన మతపరమైన భావనలను నాశనం చేయడమే అన్నారు. ఈ కార్యక్రమంలో పూలే పెరియార్ అంబేద్కర్ ఆలోచన వేదిక ప్రతినిధులు జీవి జ్యోతి కుమార్, అధ్యక్షుడు గోడిసెల శ్రీహరి, రంగ ప్రశాంత్, గోడిసెల సామి, దుబాసి రవి, అక్కు కృష్ణ, రవి రాజ్, ఉంద్రాల రవి, కమల్, బక్కయ్య, ప్రేమ్ కుమార్, కోమ్ము బాపు, మద్దివెని చిన్న భీమయ్య, రజీని పలేకర్, ఎల్లయ్య, రసకొండ ప్రసాద్, మంజుల, సుంక లక్ష్మన్, మాదుగుల శంకర్, సంకె రవి తదితరులు పాల్గొన్నారు.

# కుంటలో పడి యువకుడి మృతి



కాసిపేట మే 03 ( జనం సాక్షి )చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి మండలంలోని వెంకటాపూర్ శివారులో అడవి ప్రాంతంలో అడవి శాఖ అధికారులు నిర్మించిన కుంటలో పడి సురేష్ 16 అనే యువకుడు మృతి చెందినట్లు దేవాపూర్ ఎస్ఐ గంగారాం తెలిపారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిన్న అరిదపల్లి గ్రామానికి చెందిన మదావి సురేష్ వారం రోజుల క్రితం వెంకటాపూర్ లో నివాసం ఉండే తన మేనత్త అత్రం గోధు భాయ్ ఇంటికి వెళ్లడం జరిగిందన్నారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో వెంకటాపూర్ చెందిన గ్రామస్తులు అడవి ప్రాంతంలో అటవీశాఖ జంతువుల కోసం ఏర్పాటు చేసిన నీటి కుంటలో పడి మృతి చెందినట్లు సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు తన మిత్రులతో కలిసి చేపల కోసం వెళ్లి నీటి లోతు అంచనా వేయకుండా నీటిలోకి దిగడంతో ఈతరాక మునిగిపోవడం జరిగిందని ఇది చూసిన భీమ్ భాయ్ కేకలు వేయగా అటువైపుగా వెళ్తున్న కొందరు వ్యక్తులు సురేష్ ను బయటకు తీయగా అప్పటికే చనిపోవడం జరిగిందన్నారు సురేష్ ప్రమాదవ శాత్తు నీటిలో పడి మృతి చెందడం జరిగిందని ఈ అంశంపై ఎలాంటి అనుమానం లేదని తండ్రి బుజ్జి రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగారం తెలిపారు

# జొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



నిర్మల్ బ్యూరో, మే03 ,(జనంసాక్షి) నిర్మల్, సారం గాపూర్ మార్కెట్ యార్డుల్లో ఆదివారం జొన్న కొనుగోలు కేంద్రాలను బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు..నిర్మల్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ తో పాటు సారం గాపూర్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్లో జొన్న కొనుగోలు కేంద్రాలను బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. కనీస మద్దతు ధర క్వింటాల్ కి రూ. 3699/- ఉందని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ పంటలను అమ్మకానికి వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులని అన్ని విధాల ఇబ్బందులకు గురిచేస్తుందని పేర్కొన్నారు. అకాల వర్షాలు, ఈదురు గాలులతో ఒక వైపు చేతికొచ్చిన పంట నష్టం వాటిల్లితే, కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం చేసి, ఈ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందని అన్నారు. పంట నాణ్యతను పక్కనపెట్టి అన్ని రకాల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు,రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి పై కాంగ్రెస్ నాయకులు చేసిన విమర్శలకు ప్రజలే తగిన బుద్ధి చెప్తారు

**బిఆర్ఎస్ మండల సోషల్ మీడియా ఇన్చార్జి బోడ మురళి నాయక్**



చెన్నారావుపేట, మే 3 ( జనం సాక్షి): నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పై కాంగ్రెస్ నాయకులు చేసిన విమర్శలకు నియోజకవర్గ ప్రజలే తగిన బుద్ధి చెప్తారని బిఆర్ఎస్ మండల సోషల్ మీడియా ఇన్చార్జి బోడ మురళి నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదాములు లేవు గోనె సంచులు రావు గోదాముల్లో చోటు లేదు పాలకుల్లో తెలివి లేదు అని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రశ్నిస్తే విమర్శలు చేయడం తగదన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో రైతులు కొనుగోళ్లు జరగక గోనె సంచులు దొరకక రైతులు కన్నీళ్లు పెడుతుంటే వారి పక్షాన నిలబడిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పై విమర్శలు చేయడం కాంగ్రెస్ నాయకుల నీచ రాజకీయాలకు పరాకాష్ట అని విమర్శించారు. నాడైనా నేడైనా రైతుల పక్షాన బిఆర్ఎస్ నిలబడి పోరాడుతుందన్నారు. చేతకానితనాన్ని ప్రశ్నించి నందుకు విమర్శలకు దిగితే సహించేది లేదన్నారు. ప్రజలంతా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గమనిస్తున్నారని రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు.

# అరుంగళం కష్టపడి పండించిన పంట

**రైతులు చూస్తుండగానే అగ్నికి ఆహుతి**

**చేతికొచ్చిన పంట బుగ్గిపాలు**

**బాధిత రైతులను ఆదుకోవాలని స్థానికుల డిమాండ్**



బోథ్, మే 03(జనంసాక్షి)అగ్ని ప్రమాదంలో జొన్న పంట అగ్నికి ఆహుతి అయిన ఘటన ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కనుగుట్ట గ్రామంలో చోటు చేసుకుంది. స్థానిక రైతులు తెలిపిన వివరాల మేరకు బోథ్ శివరానికి చె మహిళ రైతు మునిగేలా రుక్మ కు చెందిన 7 ఎకరాల జొన్న పంట,మునిగేలా రఘు కు చెందిన 12 ఎకరాలు,భీమా మహేందర్ 2 ఎకరాలు,కుమ్మరి సాయి 3 ఎకరాలు అలాగే నీటి పైపులు పూర్తిగా కాలి బూడిదైయింది. ఒక చేనులో మొదలైన మంటలు చూస్తుండగానే పక్కనే ఉన్న ఇతర చేనులోకి విస్తరించాయి..ఈ గోర అగ్ని ప్రమాదంలో ఇప్పటి వరకు దాదాపు 50 ఎకరాల సాగు చేసిన మొక్క జొన్న పంట పూర్తిగా అగ్గిపాలయ్యి ఒది కళ్ళ ముందే చేతికొచ్చిన పంట బూడిదవుతుంటే రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. బాధిత రైతులను తక్షణమే ప్రభుత్వం స్పందించి ఆర్థికంగా ఆదుకోవాలని స్థానికుల కోరుతున్నారు.

# రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా
# వరి ధాన్యం కొనుగోలు చేయాలి

● ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**హనుమకొండ ప్రతినిధి మే 3 (జనం సాక్షి) :** వర్ధన్నపేట నియోజకవర్గంలో మొక్కజొన్న, వరి సేకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అధికారులను ఆదేశించారు. ఆదివారం హనుమకొండలోని కుడా సమావేశ మందిరంలో వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్యశారద, చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్లతో కలిసి సంబంధిత అధికారులతో మొక్కజొన్న, వరి సేకరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జిల్లాలో ఈసారి మొక్కజొన్నతో దిగుబడులు గణనీయంగా పెరిగినందున, రైతుల ఉత్పత్తులను సకాలంలో సేకరించి సరైన ధర కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి, ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తెచ్చే మొక్కజొన్న, వరి ధాన్యాన్ని మార్కెట్ యార్డుల్లోని కవర్ షెడ్లలో భద్రపరచేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నిల్వ సదుపాయాలు, రవాణా, తూకం, చెల్లింపుల ప్రక్రియలు పారదర్శ కంగా, వేగవంతంగా సాగాలని పేర్కొన్నారు. హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహేత్ బాజ్ పాయి మాట్లాడుతూ, మొక్కజొన్న, వరి సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, వర్ధన్నపేట నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కొనుగోలు కేంద్రాలు సిద్ధంగా ఉంచి, రైతులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఇల్లంద మార్కెట్ కమిటీ చైర్మన్ నరకుడు వెంకటయ్య, అదనపు కలెక్టర్లు రవి, సంధ్యారాణి, డీఆర్డీఓ మేన శ్రీను, వ్యవసాయ శాఖ అధికారులు, డీసీఓలు,మార్కెటింగ్, మార్క్ ఫెడ్ అధికారులు ఏడీఓలు, తహసీల్దార్లు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





## రైతులు పండించిన వడ్లను ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

**మహదేవపూర్, మే 2 (జనంసాక్షి) :** రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వము ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో వడ్లు తీసుకోవచ్చి విక్రయించాలని దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని అన్నారు. శనివారం రోజున మహదేవపూర్ మండల కేంద్రంలోని కాలేజీ గ్రౌండ్లో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోన్ని కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ పంతకాని తిరుమల, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోటి రాజబాబు . సర్పంచి హసీనా భాను మాజీ పిఎస్ చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి. ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ. రైతులు పండించిన వడ్లను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో కి తీసుకువచ్చి విక్రయించాలని. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు 500 బోనస్ ఇవ్వడం జరుగుతుందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారన్నారు. అదేవిధంగా రైతులు పండించిన సన్న వడ్లకు మద్దతు ధర 2389 రూపాయలతో పాటు బోను సైజు వందల రూపాయలు ఇస్తుందని రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు. సర్పంచ్ హసీనా భాను.సింగల్ విండో చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి. ఈ వామన్ రావు. మాజీ ఎంపీటీసీ సుధాకర్. కాటారం మార్కెట్ కమిటీ చైర్మన్ పంతకాని తిరుమల. సమ్మయ్య. డైరెక్టర్లు రామకృష్ణ. ఉప సర్పంచ్ శ్రీజ. సీఈవో రాజబాబు. రైతులు పాల్గొన్నారు.


## ఆత్మకూరుకు కాంగ్రెస్‌లో గౌరవ స్థానం

● రేవూరి రణధీర్ రెడ్డి హన్మకొండ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఎంపిక



**ఆత్మకూరు, మే 3 (జనం సాక్షి):** ఆత్మకూరు గ్రామానికి చెందిన యువ నాయకుడు రేవూరి రణధీర్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీలో కీలక గౌరవం దక్కింది. హన్మకొండ కాంగ్రెస్ కమిటీలో ప్రధాన కార్యదర్శిగా నియామకం పొందడం గ్రామానికి గర్వకారణంగా మారింది. ఈ నియామకంతో ఆత్మకూరు ప్రజల్లో ఆనందం వెల్లివిరిసింది. స్థానికులు, పార్టీ శ్రేణులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ, మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రణధీర్ రెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , డీసీసీ అధ్యక్షులు ఇనుగాల వెంకట్రం రెడ్డి, కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి, ప్రజాసేవ కోసం మరింత కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

## ఎల్కేశ్వరం శివారులో యువకుడిని మృతదేహం లభ్యం



**మహదేవపూర్, మే 3 (జనంసాక్షి) :** బొమ్మపూర్ గ్రామానికి చెందిన శనిగరం శ్రీకాంత్ (27) అనుమానాస్పదంగా మృతి చెందాడు. రెండు రోజుల క్రితం కనిపించకుండా యువకుడు బొమ్మపూర్ గ్రామానికి పక్కగా ఉన్న ఎల్కేశ్వరం శివారులో ఆదివారం మృతదేహం లభ్యం కావడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పంచనామా కోసం మహదేవపూర్ సామాజిక వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం నిర్వహించి అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## పల్లె ప్రకృతి వనం చెట్ల నరికివేత

**శాయంపేట, మే 3 (జనం సాక్షి) :** శాయంపేట మండలంలోని కాట్రపల్లి గ్రామంలో పల్లె ప్రకృతి వనంలోని చెట్లను అక్రమంగా నరికి వేస్తున్నారు అని కాట్రపలి ఉప సర్పంచ్ ,వార్డు సభ్యులు ఆరోపిస్తున్నారు. కొత్తగా ఎన్నుకున్న మెట్ దగ్గరుండి ఈ చెట్లను నరికి వేయడం విశేషం. ఈ విషయంలో గ్రామ కార్యదర్శిని అడుగుతే వందరోజుల ఉపాధి హామీ పని దగ్గర నీడ కోసం ప్రకృతి వనం చెట్లను నరికి కూలీల కోసం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పడం కోసమెరుగు. చెట్లను పెంచండి వాతావరణ కాలుష్యాన్ని తగ్గించండి అని ఒక వైపు చెప్తుంటే మరొకవైపు అనవసరంగా బాధ్యతారహితంగా చెట్లు నరికి వేయడం ఎంతవరకు సమంజసం అని ఉప



సర్పంచ్ ,వార్డు సభ్యులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు విచారణ చేపట్టి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## ఐటీ మంత్రి కోటి 45 లక్షలు నిధులు మంజూరు



**మహదేవపూర్, మే 3( జనంసాక్షి) :** మహదేవపూర్ మండలంలో 18 గ్రామపంచాయతీలకు సి ఆర్ ఆర్ నిధులనుండి రూ.కోటి 45 లక్షలు మంజూరు చేసిన ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు. అంబటిపల్లి గ్రామానికి 10 లక్షలు. అన్నారం 10 లక్షలు. బెగ్లూర్ 5. బొమ్మపూర్ 10. బ్రాహ్మణపల్లి 5. చంద్రుపల్లి 10 ఎడపెల్లి 10. ఎలికేశ్వరం 5. ఎనకపల్లి 15. కిష్టరావుపేట్ 5. కాలేశ్వరం 10 కుదురుపల్లి 10 మద్దులపల్లి 5 మహదేవపూర్ 10 మెట్పల్లి 5 పలుగుల 10.కుంట్లం 5 పెద్దంపేట 5 రాపెల్లికోట 5 సూరారం 10 లక్షల రూపాయలను ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు. గ్రామ అభివృద్ధి కోసం సీసీ రోడ్లు డ్రైనేజీలకు పనులకు మంజూరు ఇచ్చినందున మహదేవపూర్ మండలంలోని కాంగ్రెస్ పార్టీ సర్పంచులు నాయకులు కార్యకర్తలుహర్షం వ్యక్తం చేశారు.

## పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల్ని నియమించాలి

● ఎంసిపిఐయూ డిమాండ్

**బెల్లంపల్లి, మే 3, (జనంసాక్షి) :** బెల్లంపల్లి పట్టణంలోని శంశీర్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో వైద్యులను నియమించాలని ఎంసిపిఐయూ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఎంసిపిఐయూ కార్యాలయంలో మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలోని షంషీర్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు లేరని, ఒక డాక్టర్ ఉన్నా క్యాంపులకు పంపిస్తున్నారని అన్నారు. దీంతో సిబ్బంది రోగులకు సరైన వైద్య సేవలు అందించలేక పోతున్నారని అన్నారు. ఆరోగ్య కేంద్రం చుట్టుపక్కల, చిన్న బుధ, రాళ్ల పేట, ఇందిరా నగర్, షంషేర్ నగర్ బస్తీలే కాకుండా బెల్లంపల్లి పట్టణంలోని పలు వార్డుల ప్రజలు వైద్యం కోసం వెళ్తారని, జ్వరం కానీ, ఇతర రోగం కానీ వచ్చి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లేసరికి డాక్టర్ లేకపోవడంతో కెమికల్ ఏరియా ఆసుపత్రికి వెళ్లక తప్పని పరిస్థితి ఏర్పడిందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లను అందుబాటులో ఉంచాలని కోరారు.

## గుడెప్పాడ్ జంక్షన్‌లో చలివేంద్రం



**ఆత్మకూరు, మే 3 (జనం సాక్షి):** వరసిద్దు వాటర్ ప్లాంట్ కామారం వారి మొదటి వార్షికోత్సవం సందర్భంగా గుడెప్పాడ్ జంక్షన్ లో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుడెప్పాడ్, కామారం గ్రామ సర్పంచులు పరికి రమేష్ బాబు,తోట లక్ష్మి పాల్గొని ప్రారంభించడం జరిగింది. అనంతరం గుడెప్పాడ్ సర్పంచ్ పరికి రమేష్ బాబు మాట్లాడుతూ సామాజిక సేవ చేయాలని ఆలోచన రావడం అభినందించదగ్గ విషయమని, ఇంతటి మండు టెండల్లో ప్రయాణికుల సౌకర్యార్థం వరసిద్దు వాటర్ ప్లాంట్ వారు చలివేంద్రం ఏర్పాటు మంచి విషయం అని కొనియాడారు కామారం గ్రామ సర్పంచ్ తోట లక్ష్మి మాట్లాడుతూ గుడెప్పాడ్ జంక్షన్ లో రోజు వేల మంది ప్రయాణికుల ప్రయాణిస్తారని వారి దాహార్తిని తీర్చడం కోసం చలివేంద్రం పెట్టడం మంచి ఆలోచన అని చెప్పడం జరిగింది. అనంతరం వరసిద్దు వాటర్ ప్లాంట్ నిర్వాహకులు బూర వరుణ్ గౌడ్ చందు గౌడ్ మాట్లాడుతూ గుడెప్పాడ్ గ్రామపంచాయతీ వారి సహకారంతోనే చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేస్తూ మునుముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానని తెలపడం జరిగింది ప్రయాణికులు చలివేంద్రం ఏర్పాటు చేసినందుకు చల్లటి నీళ్లు తాగుతూ సంతోషం వ్యక్తం చేశారు.